సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం, 4, ఏప్రిల్, 2025



సర్వం దోచేస్తారు..

ఇద్దరు గజదొంగలు పోలీసులకు దొరికారు. 17 కేసుల్లో వీరు నిందితులు.

- 8లో



అక్రమంగా మట్టి తవ్వకాలు

నరసన్నపేట మండలంలో అక్రమంగా మట్టి తవ్వుతున్నారు. నిబంధనలు కాలరాస్తున్నారు.

- 8లో



టెన్త్ స్పాట్ ప్రారంభం

టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనం మొదలైంది. డీఈఓ మూల్యాంకన కేంద్రాలకు రాలేదు.

- 8లో

న్యూస్‌రీల్

7 నుంచి డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అఫిలియేషన్ డిగ్రీ కళాశాలల నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు యూజీ ఎగ్జామినేషన్స్ డీన్ పి.పద్మారావు చెప్పారు. పరీక్ష కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. 54 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. రెగ్యులర్‌గా, సప్లిమెంటరీ విధానంలో 9000 మంది వరకు పరీక్షలకు హాజరవుతున్నారని చెప్పారు.

పీజీ పరీక్షల నిర్వహణకు నోటిఫికేషన్



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పలు పీజీ పరీక్షల నిర్వహణకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పీజీ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ గురువారం తెలిపారు. పీజీ నాల్గో సెమిస్టర్ పరీక్ష రాసేవిద్యార్థులు ఈ నెల 14వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని అన్నారు. ఈ నెల 21 నుంచి 30 మధ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బీటెక్ 8వ సెమిస్టర్ పరీక్షకు సంబంధించి ఈ నెల 14వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని, పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. వర్సిటీ అఫిలియేషన్ బీపీఈడీ, డీపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ నెల 14వ తేదీ లోపు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు.

'అమరవీరుల వారోత్సవాలను విజయవంతం చేయాలి'



బొడ్డపాడులో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పలాస: అమరవీరుల వారోత్సవాలను విజయవంతం చేయాలని సి.పి.ఐ ఎం.ఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద గురువారం కరపత్రాలను, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు భారత విప్లవోద్యమంలో అగ్రనాయకుల్లో ఒకరైన పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభ ఈనెల 13న పలాసలో జరగనుందని, అలాగే అమరవీరులు రాయల సుభాష్ చంద్రబోస్, చంద్రపుల్లారెడ్డి, మాదాల నారాయణస్వామి వర్ధంతిలు కూడా ఇదే నెలలో ఉన్నాయని, వారి జ్ఞాపకార్థం రాష్ట్ర వ్యాప్తంగా ఈ సభలు నిర్వహించాలని కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు గొరకల బాలకృష్ణ, జుత్తు వీరాస్వామి, పోతనపల్లి కుసుమ, వంకల పాపయ్య, కుత్తుం హేమ, మురిపింటి తాతారావు, సార జగన్, మద్దిల వినోద్, బదకల ఈశ్వరి, జడ్డే అప్పయ్య పాల్గొన్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



పాతపట్నంలోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం

పాతపట్నం : నిషిద్ధమైన ఆహార పదార్థాలను విక్రయిస్తే అలాంటి దుకాణాలను శాశ్వతంగా మూసివేయడంతోపాటు బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని శ్రీకాకుళం ఫుడ్ కంట్రోల్ అధికారి కె.వెంకటరత్నం హెచ్చరించారు. పాతపట్నంలో మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కిరాణా, స్వీట్స్, టీ, తదితర దుకాణాలను తన బృందంతో కలిసి గురువారం తనిఖీ చేశారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో ఒడిశా నుంచి తీసుకువచ్చిన నకిలీ వస్తువులు చెలామణీ చేస్తున్నారని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. రంగులు కలిపిన ఆహార పదార్థాలు ప్రజలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి కె.లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామ రామ రామేతి..



- సాగర తీరంలో సీతారాముల పరిణయం
- నువ్వలరేవులో ఆధ్యాత్మిక శోభ
- 12వ తేదీ వరకు అట్టహాసంగా శ్రీరామనవమి ఉత్సవాలు

ఊరంతా పందిరి వేయాలి.. ఇంటింటా పచ్చ తోరణాలు కట్టాలి.. మంగళ వాద్యాలు ప్రతి వీధిలోనూ వినిపించాలి.. సాగర ఘోషతో సమానంగా వేదమంత్రాలు ప్రతిధ్వనించాలి.. ఆ సందడి మధ్య రామచంద్రుడి పెళ్లి జానకమ్మతో జరగాలి.. ఇది నువ్వలరేవు కట్టుబాటు. అనాదిగా పాటిస్తున్న ఆచారం. రాముడి పెళ్లికి ఆ ఊరివారంతా పెళ్లి పెద్దలుగా మారిపోతారు. ఇంటి ఆడపడుచుకు కన్యాదానం చేసినంత సంబరంగా సీతమ్మను రామచంద్రుడి చేతిలో పెడతారు. పెళ్లి చేయగానే పండగ కాదు.. కదా మరో ఆరు రోజులాగి రావణ సంహారాన్ని కూడా కానిచ్చి నవమి వేడుకలు పూర్తి చేస్తారు.



ఉత్సవాలకు ముస్తాబైన నువ్వలరేవు గ్రామం

వజ్రపుకొత్తూరు రూరల్:

వలస పక్షులు వచ్చి వాలిపోయాయి. చలువ పందిళ్లు కొలువు దీరాయి. శుభరాట కూడా ఠీవిగా నిలబడింది. మొత్తానికి నువ్వలరేవు మినీ అయోధ్యలా మారిపోయింది. జిల్లాలోనే అతి పెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవు రామనవమికి సిద్ధమైంది. పెద్దలు పెట్టిన కట్టుబాట్లను తూచా తప్పకుండా పాటించే ఈ గ్రామంలో సీతారాముల కల్యాణం చేయడం తమ బాధ్యతగా భావిస్తారు.

ఈ మత్స్యకార గ్రామంలో సుమారు 3,300 ఇళ్లు ఉండగా దాదాపుగా 12 వేల మంది జనాభా ఉన్నారు. కేవలం బెహరా, మువ్వల, బైనపల్లి ఇంటి పేర్లతో ఉండే ఈ గ్రామంలో 'బెహరా'లను గ్రామ పెద్దగా నిర్ణయిస్తారు. పెద బెహరా, చిన బెహరాలు చెప్పే మాటలకు కట్టుబడి కార్యక్రమాలు చేపడతారు. గ్రామంలో జరిగే అన్ని ఉత్సవాల కంటే సీతారాముల కల్యాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. ఏటా వైభవంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా మార్చి 30 (ఆదివారం) నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరిపేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేపట్టారు.


కార్యక్రమాలు ఇవే

రామ నవమి వేడుకల కోసం గ్రామంలో పెద్దలంతా సమావేశం ఏర్పాటు చేసి కార్యక్రమాలను రూపొందించారు. గత నెల 30న సాయంత్రం దాసుడు ఇంటి నుంచి దేవరతో బయలుదేరి తక్కురాణి అమ్మవారికి పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలు వచ్చే నెల 12న జరిగే రావణ సంహారంతో ముగియనున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం శ్రీరామనవమి. ఆ రోజున ముందుగా గ్రామ దేవత బృందావతి అమ్మవారి ఆలయం వద్ద జెండాను ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే రామాలయం వద్ద మరో జెండాను ఆవిష్కరించి హోమం, యజ్ఞాలతో పండితులు వేదమంత్రోచ్ఛరణల మధ్య సీతారాములు కల్యాణం కనుల పండువగా జరుపుతారు. తర్వాత రోజు నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు మొదలవుతాయి. ఇందులో భాగంగా యువకులు డ్యాన్స్‌లు, పగటి వేషాలతో అలరిస్తారు. కర్రసాము, పాండురంగ నాటకం, రామ నాటకం, రామయ్య పట్టాభిషేకం, మండపారాధన, కోయి డ్యాన్స్, రావణ దహనం తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ ఉత్సవాలు ముగిస్తారు.



వేడుకలకు సిద్ధమైన రామాలయం

ఇదే పెద్ద పండగ..



కొలువుదీరిన సీతారాములు

తాము ఎక్కడ ఉన్నా గ్రామ దేవత బృందావతి అమ్మవారి చల్లని దీవెనలు, సీతారాముల కరుణా కటాక్షాలు తమపై ఎల్లప్పుడూ ఉంటాయని గ్రామస్తుల విశ్వాసం. అందుకే సుమారు రూ.50 లక్షల వరకు వెచ్చించి అత్యంత వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పెద్ద పండగగా ఏటా జరుపుకుంటారు. శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలతో ఊరంతా మెరిసిపోతోంది. ఉత్సవాలు చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా వస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల చొరవతో గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐకమత్యంతో నవమి ఉత్సవాలు



తరతరాలుగా వస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాలు ఐకమత్యంతో జరుపుకుంటున్నాం. మా ఇంటి ఇలవేల్పుగా బృందావతి అమ్మవారిని కొలుచుకుంటూ మాకు ఆదర్శ దైవంగా నిలిచిన శ్రీరాముడు, సీతమ్మలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఏటా వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నాం.
– ముువ్వల పూర్ణచంద్రరావు, సర్పంచ్, నువ్వలరేవు

ఆచారాలకు పెద్ద పీట



తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలకు పెద్ద పీట వేస్తాం. వలస కూలీలు ఎక్కడ ఉన్నా స్వగ్రామానికి చేరుకుని ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు, పూజారులు, యువకులు సహకారంతో ఉత్సవాలు జరుపుకుంటాం.
– బైనపల్లి నవీన్, సొసైటీ అధ్యక్షుడు, నువ్వలరేవు

అబ్బో.. ఎంత డబ్బు!
పంపకాల జబ్బు

- రూ.లక్షల్లో డబ్బులు పంచిపెట్టిన ఓ మందుబాబు
- రికవరీకి పోలీసుల ప్రయత్నం
- సుమోటాగా కేసు నమోదు
- పోలీసులు వేధిస్తున్నారని గ్రామస్తుల ఆరోపణ



శ్రీకాకుళం క్రైమ్ :

పొట్టకూటి కోసం వలస వెళ్లిన ఓ వ్యక్తి అకస్మాత్తుగా చేతి నిండా డబ్బుతో ఊరికి రావడం.. ఆ సొమ్మును ఉత్తి పుణ్యానికి స్నేహితులకు పంచిపెట్టడం.. ఆ విషయం పోలీసులకు తెలిసి అసలు విషయాలు రాబట్టడం... శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు పంచాయతీ రాయపాడు గ్రామంలో మూడు రోజులుగా ఈ హైడ్రామా నడుస్తోంది. చేతిలో ఉన్న సొమ్ముతో కమ్మిన మైకం ఓ వైపు.. మద్యం మత్తు మరోవైపు కలగలిపి ఓ వ్యక్తిని ఇలా పోలీసుల ముందు నిలబెట్టాయి. ఈ అంశంలో గ్రామస్తులు, పోలీసుల వివరణలు వేర్వేరుగా ఉండడం గమనార్హం. దీనిపై పోలీసులు సుమోటాగా కేసు నమోదు చేశారు.

గ్రామస్తులు ఏమంటున్నారు..?

గ్రామానికి చెందిన అంజూరి కృష్ణం అలియాస్ బుడ్డి కోల్‌కతాలో ఉండేవాడు. కొన్ని రోజుల కిందట బ్యాగు నిండా డబ్బుతో ఊరికి వచ్చాడు. నోట్ల మార్పిడిలో తన వాటాగా రూ.50 లక్షలకు పైగా వచ్చిందని ఊరంతా చెప్పుకున్నాడు. సాధు అచ్యుతరావు, మచ్చుపల్లి చిన్నారావు, శేశెట్టి వెంకటరమణకు రూ.లక్షల్లో, మరికొందరికి రూ.వేలల్లో డబ్బును ఊరికే ఇచ్చాడు. కృష్ణం ఇలా రూ.లక్షల్లో డబ్బులు పంచుతున్న విషయం పోలీసులకు తెలిసింది. దీంతో రూరల్ పీఎస్, ఒకటో పట్టణ పీఎస్ క్రైమ్ పోలీసులమని కొందరు వచ్చి వారి వద్ద నుంచి డబ్బులు రికవరీ చేశారు. గురువారం కూడా స్టేషన్‌కు పిలిపించారు. అయితే కృష్ణం ఇచ్చిన దాని కన్నా పోలీసులు ఎక్కువగా అడుగుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పోలీసులు ఇలా చెబుతున్నారు..

ఈ విషయమై ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు వద్ద 'సాక్షి' ప్రస్తావించగా ఆయన ఏమన్నారంటే.. రాయపాడుకు చెందిన కృష్ణం కోల్‌కతా బడాబజార్ మచువా చిట్‌పూ ఏరియాలో చీరలు అమ్ముకునే పప్పుస్వామి అలియాస్ రత్నకుమార్ నేత్రా వద్ద రూ.6వేల జీతానికి పనిచేసేవాడు. అతని భార్య కూడా అక్కడే పనిచేస్తోంది. కృష్ణం జీతం పెంచమని ఎప్పుడూ ఓనర్‌ను అడిగేవాడు. కానీ ఓనర్ పెంచేవాడు కాదు. ఈ క్రమంలో పప్పుస్వామికి కోల్‌కతాకే చెందిన మరో వ్యాపారి ధీరజ్‌తో లావాదేవీలుండటం, ఆయన రూ.20 లక్షలు పప్పుస్వామికి ఇవ్వాల్సి ఉండటంతో పప్పుస్వామి కృష్ణంను పంపారు. దీంతో కృష్ణం ఆ డబ్బు తీసుకుని ఓనర్ వద్దకు వెళ్లకుండా సొంత గ్రామం రాయపాడు వచ్చేశాడు. తాగిన మత్తులో ఊరిలో కొందరికి డబ్బులు ఇస్తున్నట్లు తెలియడంతో పోలీసులు విచారణ చేశారు. మూడు రోజుల కిందట 41, 109 సెక్షన్ల కింద సుమోటోగా కేసు తీసుకున్నారు. విచారణలో భాగంగా శేశెట్టి వెంకటరమణకు రూ. 10 లక్షలు, అచ్యుతరావుకు రూ. 2 లక్షలు, ముచ్చుపల్లి చిన్నారావుకు రూ. 2 లక్షలు ఇచ్చినట్లు తెలిసింది. అలాగే మరో రూ.50 వేలు తాగిన మత్తులో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పోగొట్టుకున్నట్లు గుర్తించారు. వెంకటరమణ వద్ద ఇప్పటికే సుమారు ఏడున్నర తులాల బంగారం, రూ. 2.25 లక్షలు నగదు, చిన్నారావు వద్ద రూ.1,84,500లు, అచ్యుతరావు వద్ద రూ.90 వేలు రికవరీ చేశారు. దీంతో పాటు నిందితుడు కృష్ణం నాలుగు ఉంగరాలు స్వాధీనం చేసుకున్నారు. మిగతా సొమ్ము ఏం చేశాడన్నది విచారణలో తెలుసుకుంటామని తెలిపారు. కానిస్టేబుళ్లను విచారణలో భాగంగానే గత మూడురోజులుగా పంపించామని తెలిపారు. ఈ విషయం ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి దృష్టికి వెళ్లడంతో డీఎస్పీ వివేకానందను కేసు విచారణ చేయాలని ఆదేశించారు. దీంతో నిందితుడిని రూరల్ ఎస్ఐ రాము అదుపులోకి తీసుకుని సీఐ పైడపునాయుడు సమక్షంలో విచారిస్తున్నారు.

ఆరోగ్య శాఖలో అవినీతి రోగి

- రూ.20 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన డీఎంహెచ్‌ఓ
- ఆయనతో పాటు సీసీ సురేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ
- అదే శాఖ సీనియర్ అసిస్టెంట్ రీపోస్టింగ్ ఆర్డర్ అమలుకు లంచం డిమాండ్
- బాధితురాలు కాంతమ్మ ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ
- జిల్లా వైద్యారోగ్యశాఖలో ఇదే తొలి రెడ్‌హ్యాండెడ్ కేసు



పట్టుబడిన నగదుతో డీఎంహెచ్‌ఓ బాలమురళీకృష్ణ, సీసీ సురేష్‌కుమార్

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖ అవినీతిపై అవినీతి నిరోధక శాఖాధికారులు పంజా విసిరారు. ఏకంగా జిల్లా వైద్యారోగ్యశాఖాధికారితో పాటు ఆయన క్యాంపు క్లర్క్‌ను కూడా వల వేసి పట్టుకున్నారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో డీఎంహెచ్‌ఓ చాంబర్‌లోనే డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలమురళీకృష్ణ, ఆయన సీసీ వాన సురేష్‌కుమార్‌లు రూ.20 వేలు లంచం తీసుకుని లెక్కిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వీరిని శుక్రవారం విశాఖ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి స్పష్టం చేశారు. ఈ శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై గత నెల 5న 'వైద్యారోగ్యశాఖలో వసూల్‌రాజాలు' పేరిట సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అయినా వారు తీరు మార్చుకోలేదు. ఎట్టకేలకు అధికారులు వారిని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ తెలిపిన వివరాల మేరకు..

రీ పోస్టింగ్ ఆర్డర్ కోసం లంచం..

కల్లేపల్లి పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎ.కాంతమ్మ అనే దివ్యాంగురాలు వివిధ కారణాలతో కొంత కాలంగా విధులకు వెళ్లలేదు. తర్వాత మెడికల్ లీవ్ పెట్టుకుని రీపోస్టింగ్ కోసం వైద్యశాఖ రీజనల్ డైరెక్టర్ కార్యాలయానికి విన్నవించుకున్నారు. ఆమెకు రీపోస్టింగ్ ఇవ్వాలంటూ రెండు నెలల క్రితమే ఆర్డర్‌ను జారీ చేశారు. అయితే ఈ ఆర్డర్ పాస్ చేయడానికి రెండు నెలల నుంచి ఆ ఫైల్‌పై డీఎంహెచ్‌ఓ సంతకం చేయలేదు. ఈ రీపోస్టింగ్ ఆర్డర్ మూవ్ చేయడానికి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆమె అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రూ.20వేలు డీఎంహెచ్‌ఓకు అందజేయగా.. వారు నగదు లెక్కిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డీఎంహెచ్‌ఓతో పాటు పక్కనే ఉండి సహకరించిన సీసీ వాన సురేష్‌కుమార్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు.



రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాం

కల్లేపల్లి పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కాంతమ్మ అనే దివ్యాంగురాలు తన రీపోస్టింగ్ కోసం అడిగితే రూ.20 వేలు లంచం ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ బాలమురళీకృష్ణ డిమాండ్ చేశారనే ఫిర్యాదు వచ్చింది. దీనిపై విచారించి నేరుగా రంగంలోకి దిగి డీఎంహెచ్‌ఓను ఆయన సీసీ సురేష్‌కుమార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాం. వీరిద్దరినీ అరెస్టు చేశాం. ఎవరైనా లంచం అడిగితే మమ్మల్ని సంప్రదించాలి. ధైర్యంగా ఫిర్యాదు చేయండి.
– రమణమూర్తి, డీఎస్పీ, ఏసీబీ


సాక్షి
వైద్యారోగ్య శాఖలో..
వసూల్ రాజాలు!

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

శాఖలో తొలికేసు..

జిల్లా వైద్యారోగ్య శాఖలో ఎవరూ ఇప్పటివరకు ఏసీబీకి చిక్కలేదు. తొలిసారి ఏకంగా డీఎంహెచ్‌ఓ ఏసీబీ వలకు చిక్కడం సంచలనంగా మారింది. ఆయన జనవరిలోనే విధుల్లో చేరారు. విధుల్లో చేరినప్పటి నుంచే ఈయన వైఖరి వివాదాస్పదంగా ఉండేది. దీనిపై పలు పత్రికల్లోనూ కథనాలు వచ్చాయి. ఇప్పుడు ఓ బాధితురాలి ఫిర్యాదుతో ఏసీబీ రంగంలోకి దిగి ఏకంగా జిల్లా అధికారినే పట్టేసుకున్నారు. గురువారం మధ్యాహ్నం ఈ వార్త దావానంలా వ్యాపించడంతో స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అన్ని విభాగాధికారులు తమ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. కొందరు కార్యాలయం వదిలి బయటకు వెళ్లడం కనిపించింది.

మత్స్యకార కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేట గ్రామానికి చెందిన ఇద్దరు మత్స్యకారులు బుంగ ధనరాజు, వంక కృష్ణలు మంగళవారం చేపల వేట సాగిస్తుండగా జరిగిన తెప్ప ప్రమాదంలో గల్లంతై మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నేతలు పార్టీ తరఫున మృతుని కుటుంబాలకు రూ.50,000 చొప్పున గురువారం ఆర్థిక సాయం అందించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నియోజకవర్గంలో అందుబాటులో లేకపోవడంతో మృతుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని తెలిపారు. ఆర్థిక సాయం అందించిన వారిలో పార్టీ నాయకులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పాలిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశ్వరరావు, వైస్ ఎంపీపీ వంక రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిర్రి రాజారావు, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు ఉన్నారు.

11 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

హిరమండలం: వంశధార నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎస్.హనుమంతురావు, ఎస్ఐ ఎండీ యాసిన్ హెచ్చరించారు. వంశధార నది నుంచి అక్రమంగా తరలిస్తున్న 11 ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్, ఎస్ఐలు గురువారం ఆకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. ఇసుక తరలిస్తున్న వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని భగీరథిపురం, పిండ్రువాడ, ఎంఎల్‌పురం గ్రామాల పరిధిలో వంశధార నది నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందని, ట్రాక్టర్ల యజమానులతో కూడా మాట్లాడామని, ఇక్కడ రీచ్ లేదని వివరించామని తెలిపారు. ట్రెంచ్‌లు ఏర్పాటు చేసినా వాటిని కప్పి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని, దీనిపై సమాచారం రావడంతో పోలీసులతో కలిసి దాడి చేశామన్నారు. దాడిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్లతో పాటు నదిలో ఉన్న 3 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. వీరికి మొదటి హెచ్చరికగా అపరాధ రుసుం వేస్తున్నట్లు తెలిపారు. హిరమండలంలో ఇసుక రీచ్ లేదని, ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు వినయ్



తుంగాన వినయ్

శ్రీకాకుళం న్యూకాలనీ: 15వ ఆలిండియా సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి తుంగాన వినయ్ ఎంపికయ్యాడు. ఈ పోటీలు ఈనెల 4 నుంచి 15వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నగరం వేదికగా జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ పురుషుల హాకీ జట్టుకు వినయ్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ పోటీల కోసం ఇప్పటికే ఆంధ్రా జట్టుతో కలిసి యూపీ చేరుకున్నాడు. గతనెల 6 నుంచి 8 వరకు గుంటూరులో జరిగిన రాష్ట్రపోటీల్లో రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. శ్రీకాకుళం నగరం ఫాజుల్‌బాగ్‌పేట వీధికి చెందిన తుంగాన గోపి కుమారుడు వినయ్.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి జిల్లాకు చెందిన బచ్చు వరలక్ష్మి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులకు విరాళ చెక్కును అందించారు. ఈ సందర్భంగా శోభనాద్రాచార్యులు మాట్లాడుతూ రూ.లక్ష అంతకుమించి విరాళాలిచ్చిన దాతలకు రథసప్తమి వంటి పర్వదినాల్లో విశిష్ట దర్శనానికి డోనర్ పాసులిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజినీరింగ్ ఎస్ఈగా రవి



రవికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మహంతి తదితరులు

అరసవల్లి: పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగ పర్యవేక్షక ఇంజినీర్ (ఎస్ఈ)గా గిద్దలూరి రవి గురువారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఈయన పాలకొండ పీఆర్ ఈఈగా బాధ్యతలు నిర్వర్తించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లాలో డివిజన్ల ఈఈలు ఇతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి రవికి శుభాకాంక్షలు తెలియజేశారు. పీఆర్ ఇంజినీర్ల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసీహెచ్ మహంతి గౌరవపూర్వకంగా కలిశారు. జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం సేవలను మరింత విస్తరిస్తానని రవి తెలిపారు.

6న ఎస్సీ వర్గీకరణ సమావేశం

రణస్థలం: ఎస్సీ వర్గీకరణ అనే అంశంపై సూచనలు, సలహాలు, చర్చ నిర్వహించేందుకు ఈ నెల 6న జిల్లా కేంద్రంలోని ఇలిసిపురం వద్ద అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఏపీపీగా భాగ్యలక్ష్మి



జి.భాగ్యలక్ష్మి

శ్రీకాకుళం పాత బస్టాండ్: జిల్లా కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏపీపీ)గా గొద్దు భాగ్యలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె నియామకం పట్ల జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి పిట్ట దామోదర్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు గురువారం అభినందనలు తెలియజేశారు.

ఆన్‌లైన్‌లో కూచిపూడి నాట్య శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: కూచిపూడి నాట్య శిక్షణ తరగతులు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు నగరానికి చెందిన ప్రముఖ నాట్యకారిణి స్వాతి సోమనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ కోర్సు, డిప్లమో కోర్సులు, ఎంఏ కూచిపూడి డ్యాన్స్‌లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9849107426 నంబరును సంప్రదించాలని కోరారు.

శికారుకెళ్తారు..
సర్వం దోచేస్తారు



- ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన గజదొంగలు
- 17 చోరీలు చేసిన ఇద్దరు నిందితుల అరెస్టు
- ఒకరిది ఎచ్చెర్ల మండలం ముద్దాడ, మరొకరిది పార్వతీపురం మన్యం జిల్లా జోగంపేట
- 37 తులాల బంగారం, 20 తులాల వెండి రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ :

బండిపై సాయంత్రం అలా షికారుకి వెళ్లినట్లు తామెంచుకున్న గ్రామానికి వెళతారు.. వెంట తీసుకెళ్లిన ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసి తాళాలు వేసి ఉన్న ఇళ్లను రెక్కీ చేసి తిరిగి వెళ్లిపోతారు.. అదే రోజు రాత్రి చోరీ ఎక్కడ చేద్దామనుకున్నారో.. ఆ ఇంటికి కాస్త దూరంలో బండి పార్కింగ్ చేసి వారి వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డు, స్క్రూ డ్రైవర్‌తో ఇంటి తాళాలు పగులగొడతారు.. బీరువా తలుపులు విరగ్గొట్టి అందులో ఉన్న నగదు, బంగారం, వెండి దోచుకుని పరారవుతారు.. ఇలా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 17 చోట్ల చోరీలు చేసి ఎట్టకేలకు కాశీబుగ్గ పోలీసులకు చిక్కారు. వీరి వద్ద నుంచి 37 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండిని స్వాధీనపర్చుకున్నారు. ఈ మేరకు నిందితు లైన పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం జోగింపేటకు చెందిన పోలా భాస్కరరావు, శ్రీకాకుళం ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామానికి చెందిన ముద్దాడ నర్సింగరావులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి గురువారం మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు.

కాశీబుగ్గ పోలీసులకు చిక్కి..

గతేడాది మే 24న కాశీబుగ్గ పీఎస్ పరిధిలో బంగారం, వెండి చోరీ చేసిన కేసులో నిందితులైన భాస్కర్, నర్సింగరావులు గురువారం నర్సిపురం రైల్వేగేట్ ఎక్స్‌-సర్వీస్‌మ్యాన్ క్యాంటీన్ ఎదురుగా వాహన తనిఖీల్లో భాగంగా కాశీబుగ్గ పోలీసులకు చిక్కారు. కాశీబుగ్గ డీఎస్పీ వి.వి.అప్పారావు ఆధ్వర్యంలో సీఐ చంద్రమౌళి నిందితులను విచారించగా వారు చేసిన ఒక్కొక్క నేరం వెలుగులోకి వచ్చాయి. కాశీబుగ్గ, మెళియాపుట్టి, జె.ఆర్.పురం, టెక్కలి పీఎస్‌ల పరిధిలో ఒక్కొక్కటి, శ్రీకాకుళం రూరల్, వన్ టౌన్, టూ టౌన్‌లో మూడేసి చోరీలు, పాతపట్నంలో రెండు చోరీలు చేయగా మన్యం జిల్లా పాలకొండలో రెండు చోట్ల చోరీలకు పాల్పడ్డారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

స్వాధీనం చేసుకున్న ఆభరణాలివే..



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

17 కేసుల్లో 76 తులాలకు గాను రూ.36.80 లక్షల విలువైన 37 తులాల బంగారు ఆభరణాలు, 184.58 తులాల వెండికి గాను 20 తులాల వెండి, రూ.5 లక్షలు విలువ చేసే డైమండ్ ఆభరణాలకు గాను రూ.2 లక్షలు విలువైన డైమండ్ బ్రాస్‌లెట్, డైమండ్ లాకెట్, రూ.3.44 లక్షల నగదుకు గాను రూ.25 వేలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.లక్ష విలువైన రెండు బైక్‌లు, రూ.2 లక్షలు విలువైన ఓ స్కార్పియో వాహనం స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించడంలో కృషిచేసిన కాశీబుగ్గ పోలీసులను ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించారు.

చిన్నప్పటి నుంచే..

భాస్కరరావు తన తొమ్మిదో సంవత్సరంలోనే అప్పయ్యపేట షుగర్ ఫ్యాక్టరీ కాలనీలో ఓ ఇంట్లో డబ్బులు దొంగిలించడంతో సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో జువైనల్ కేసు నమోదైంది. మూడు నెలలు పాటు విశాఖ అబ్జర్వేషన్ హోంలో ఉన్నాడు. అప్పటి నుంచే నేర ప్రవృత్తిని ఎంచుకున్నాడు. ఇక నర్సింగరావు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఓ బైక్ షోరూంలో పనిచేస్తూ బైక్‌ను దొంగిలించి జైలుకి వెళ్లాడు. ఇద్దరికీ విశాఖపట్నం సెంట్రల్ జైలులో పరిచయమేర్పడి బయటకొచ్చాక రాత్రిపూట చోరీలు చేయడం మొదలుపెట్టారు.

లెక్కకు మించి కేసులు..



నిందితుల్లో ఒకరైన పోలా భాస్కరరావుపై శ్రీకాకుళంలో 19. విజయనగరంలో 16, విశాఖపట్నం(రూరల్-2) జిల్లాల్లో 37 చోరీ కేసులు నమోదవ్వగా ఎనిమిదింటి లో నేరారోపణ రుజువై జైలు శిక్ష అనుభవించాడు. నర్సింగరావుపై 17 కేసులుండ గా (శ్రీకాకుళం-9, విజయనగరం-4, విశాఖపట్నం సిటీ-3, పార్వతీపురం మన్యం-1) మూడింటిలో నేరారోపణ రుజువై జైలు శిక్ష అనుభవించాడు.

క్లర్క్.. పీఓ.. ఆర్‌పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్

- ఒకేసారి పలు ఉద్యోగాలకు ఎంపికైన మర్రిపాడు యువకుడు



తల్లిదండ్రులతో బాలమురళి

సరుబుజ్జిలి : మండలంలోని షళంత్రి పంచాయతీ మర్రిపాడు గ్రామానికి చెందిన వాకముల్ల బాలమురళి ఒకేసారి 4 ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. బీటెక్ పూర్తిచేసిన బాలమురళి వివిధ పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకున్నాడు. 2025 ప్రారంభంలో విడుదలైన ఆర్ఆర్‌బీ(రూరల్ రిక్రూట్‌మెంట్ బ్యాంకు)లో పీఓ, క్లర్క్ పోస్టులకు ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలైన ఐబీపీఎస్ నేషనల్ బ్యాంకులో క్లర్కు, ఆర్‌పీఎఫ్ విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సైతం ఎంపికయ్యాడు. ప్రస్తుతం పల్నాడు జిల్లా రెంటచింతలో చైతన్య గోదావరి రూరల్ బ్యాంకులో పీఓగా పనిచేస్తున్నాడు. ఈయన తండ్రి వాకముల్ల రమణమూర్తి జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడిగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి గృహిణి. ఒకేసారి నాలుగు పోస్టులకు ఎంపిక కావడంపై పలువురు అభినందించారు.

నాలుగు గంటలకే ఆధార్ సేవలు బంద్



ఆధార్ డ్రైవ్ నిర్వహిస్తున్న సిబ్బంది

సోంపేట: ఈకేవైసీలో భాగంగా ఆధార్ అప్‌డేట్ కోసం విద్యార్థుల తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పడం లేదు. సోంపేట మండలం జింకిభద్ర పంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు బెంకిలి, జింకిభద్ర పంచాయతీల ప్రజల కోసం గురువారం ఆధార్ డ్రైవ్ నిర్వహించారు. అయితే డిజిటల్ అసిస్టెంట్ సురేష్ సాహు నాలుగు గంటలకే సేవలు ముగించడంతో అంతవరకు వేచి ఉన్న లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగారు. ప్రస్తుతం వేరే సచివాలయానికి వెళ్లి సేవలు అందిస్తామని, శుక్రవారం పలాసపురం పంచాయతీ వద్ద కూడా ఆధార్ డ్రైవ్ నిర్వహిస్తామని, అక్కడికి వచ్చి అప్‌డేట్ చేసుకోమని చెప్పడం గమనార్హం. ఈ విషయమై ఎంపీడీఓ సీహెచ్ ఈశ్వరమ్మ వద్ద ప్రస్తావించగా విద్యార్థులు, తల్లిదండ్రుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఐదు గంటలకు వరకు పేర్లు నమోదు చేసి ఆధార్ అప్‌డేట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మంగరాజు

సోంపేట: మండలంలోని కొర్లాం జాతీయ రహదారి వద్ద గంజాయి తరలిస్తున్న వ్యక్తిని బారువ ఎస్ఐ హరిబాబునాయుడు అరెస్టు చేశారు. సోంపేట సర్కిల్ పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ బి.మంగరాజు గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. కొర్లాం జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. తనిఖీ చేయగా 1.050 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితుడు ఒడిశా నుంచి బాపట్లకు గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో బారువ ఎస్ఐ హరిబాబునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటిపూట బడులు అమలు చేయాల్సిందే

శ్రీకాకుళం/శ్రీకాకుళం అర్బన్: అత్యధికంగా వేసవి ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో అన్ని పాఠశాలల యాజమాన్యాలు శతశాతం ఒంటిపూట బడులు పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీఎస్సీపీసీఆర్) సభ్యుడు గొండు సీతారాం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరులతో పాటు శ్రీకాకుళం జిల్లా ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలను తమ కమిషన్ చైర్‌పర్సన్ జారీ చేసినట్లు తెలిపారు. ఇదే అంశంపై ఆర్‌సీ నెంబర్ పేరుతో రాష్ట్ర విద్యాశాఖకు ఉత్తర్వులు జారీచేసిందని, అయినప్పటికీ కొన్ని పాఠశాలలు ఈ ఉత్తర్వులు పాటించడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. తొమ్మిది, పదో తరగతులకు ప్రత్యేక తరగతుల పేరిట రెండు పూటలు, సాయంత్రం 4 నుంచి 8 వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. తరగతుల నిర్వహణపై రాష్ట్రంలో ఎవరికీ ఎటువంటి మినహాయింపులు ఉండబోవని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు రద్దు తో పాటు క్రిమినల్ చర్యలకు సిఫార్సులు చేస్తామని తెలిపారు.

తండ్రీకొడుకులపై ఆర్మీ జవాన్ దాడి

- పొలం విషయంలో గొడవ
- కత్తిపోట్లకు గురై ఆస్పత్రిలో చేరిన బాధితులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పన్న

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం చిన్నసాన పంచాయతీ గంగుపేట గ్రామంలో తండ్రీకొడుకులపై ఓ ఆర్మీ జవాన్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగుపేట గ్రామానికి చెందిన చదుసుపల్లి అప్పన్నకు తన అన్న కుమారుడైన ఆర్మీ జవాన్ చదుసుపల్లి రాముకు మధ్య కొంతకాలంగా పొలం విషయంలో తగాదాలు ఉన్నాయి. గురువారం ఉదయం ఈ విషయమై అప్పన్నకు రాముకు మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో రాము కత్తితో చిన్నాన్న అప్పన్నపై దాడి చేశాడు. తొడ, చేతులను తీవ్రంగా గాయపరిచాడు. అప్పన్న కుమారుడు హరిబాబు అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనికి సైతం గాయాలయ్యాయి. గ్రామస్తులు కలుగచేసుకుని గొడవను ఆపి బాధితులను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పన్న పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కోటబొమ్మాళి ఎస్ఐ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం గ్రామానికి చెందిన బాలికను లావేరు మండలం కేశవరాయనిపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జమ్ము మోషి ప్రేమ పేరుతో ఇటీవల వేరే ప్రాంతానికి తీసుకుపోయాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాలిక ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని గురువారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్సై వి.సందీప్‌కుమార్ తెలిపారు.

లారీ బోల్తా.. క్లీనర్ మృతి

మందస: బిన్నాలి గ్రామం వద్ద జాతీ య రహదారిపై బుధవారం లారీ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో క్లీనర్ వేమవరపు నందనం(46) మృతి చెందాడు. డ్రైవర్‌కు ప్రమాదం తప్పింది. మృతుడు గుంటూరుకు చెందిన వారని తెలియడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నక్కపేటలో ఇరువర్గాల కొట్లాట

రణస్థలం: తెప్పలవలస పంచాయతీ నక్కపేట గ్రామానికి చెందిన చుక్క అప్పలసూరి తన పొలంలో గురువారం ఉదయం ట్రాక్టర్‌తో గత్తం వేసేందుకు వెళ్లగా పక్క పొలానికి చెందిన చుక్క రాము నీరు కడుతూ ట్రాక్టర్ ను పొలంలోనికి విడిచిపెట్టలేదు. దీంతో అప్పలసూరి పోలీ సులకు సమాచారం అందించారు. జె.ఆర్.పురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సర్దిచెప్పి వచ్చేశారు. ఇదే విషయమై నక్కపేటలో అప్పలసూరి, రాము కుటుంబ సభ్యులు మధ్యాహ్నం గొడవపడి కొట్లాటకు దిగారు. ఎనిమిది గాయపడటంతో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఇన్‌చార్జి ఎస్సై జి.లక్ష్మణరావు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో షిఫ్ట్ ఆపరేటర్ మృతి



రవికిరణ్ (ఫైల్)

నందిగాం: మండల కేంద్రమైన నందిగాం ఫ్లై ఓవర్ వంతెనపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలాస సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ సంపతిరావు రవికిరణ్(38) మృతి చెందాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జలుమూరు మండలం కరవంజ పంచాయతీ తుంబయ్యపేటకు చెందిన రవికిరణ్ పలాస విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం తన ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై పలాస వెళ్తుండగా నందిగాం ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైకి వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఎగిరిపడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు హైవే అంబులెన్స్ సిబ్బంది వచ్చి రవికిరణ్‌ను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. రవికిరణ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం హెడ్ కానిస్టేబు ల్ బి.వి.రమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ స్పాట్ ప్రారంభం

- 2 కేంద్రాల్లో.. ఏడు పేపర్లకు మొదలైన మూల్యాంకనం
- 7 రోజుల్లో పూర్తిచేసేలా అధికారులు చర్యలు
- స్పాట్ కేంద్రాలకు దూరంగా డీఈఓ తిరుమల చైతన్య



మూల్యాంకన తీరును పరిశీలిస్తున్న ఆర్జేడీ బి.విజయభాస్కర్

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, సమీపంలోనే మహాలక్ష్మినగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల రెండు కేంద్రాలుగా మూల్యాంకనం మొదలైంది. తొలిరోజే మొత్తం 7 సబ్జెక్టుల పేపర్లకు దిద్దుబాటు ప్రక్రియ మొదలైంది. బాలికోన్నత పాఠశాలలో హిందీ, ఇంగ్లిష్, ఆల్ ఒరియా సబ్జెక్టుల పేపర్ల మూల్యాంకనం చేశారు. మిగిలిన అన్ని సబ్జెక్టుల మూల్యాంకనాన్ని శ్రీచైతన్య పాఠశాల కేంద్రంలో చేపడుతున్నారు. కొద్దిమంది మినహా నియామకాలు అందుకున్న ఉపాధ్యాయులంతా స్పాట్‌లో పాల్గొన్నారు. ఈ నెల 9వ తేదీనాటికి స్పాట్‌ను ముగించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

రాష్ట్ర పరిశీలకులు హాజరు..

పాఠశాల విద్య ఆర్జేడీ బి.విజయభాస్కర్ స్పాట్ కేంద్రాలను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూమ్ డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్/ఏసీ లియాకత్ ఆలీఖాన్, ఉపవిద్యాశాఖాధికారులు/డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు ఆర్.విజయకుమారి, పి.విలియమ్స్, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. 1229 మంది వరకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది మూల్యాంకనంలో పాల్గొన్నారు. వీరికి అధికారులు పలు సూచనలు చేశారు. పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 7 రోజుల్లో స్పాట్‌ను పూర్తిచేసేలా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు.

స్పాట్ కేంద్రాలకు దూరంగా తిరుమల చైతన్య..

కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ తిరుమల చైతన్య స్పాట్ కేంద్రాలకు దూరంగా ఉన్నారు. స్పాట్ కేంద్రంలో సెల్‌ఫోన్లు నిషేధమని అధికారులు చెప్పినా.. అది మాటలకే పరిమితమైంది.

విద్యార్థుల డేటా పక్కాగా ఉండాల్సిందే..

శ్రీకాకుళం న్యూకాలనీ : పాఠశాలలో చదువుతున్న ఉన్న విద్యార్థుల సంఖ్య, ఆన్‌లైన్‌లో ఉన్న విద్యార్థుల సంఖ్య కచ్చితంగా ఉందో లేదో ప్రధానోపాధ్యాయులు సరిచూసుకోవాలని విద్యాశాఖ కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. ఏ విద్యార్థి పేరైనా ఆన్‌లైన్‌లో లేనట్టయితే.. వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ అధికారులు ఈ నెల 5 వరకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో చూపించే ఎన్‌రోల్‌మెంట్‌నే బదిలీలకు ప్రామాణికంగా తీసుకోనున్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులంతా తప్పనిసరిగా ఒకసారి విద్యార్థుల డేటాను సరిచూసుకోవాలని కోరారు.

ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి



సదస్సులో మాట్లాడుతున్న మేనేజింగ్ డైరెక్టర్ బొల్లినేని భాస్కరరావు

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని, పకడ్బందీ ప్రణాళికతో లక్ష్యాన్ని చేరుకోవచ్చునని కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు అన్నారు. గురువారం రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో వైద్య, ఆరోగ్య రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కోర్సు చదివితే భవిష్యత్‌లో బాగా స్థిరపడతామో ఆ కోర్సునే ఎంచుకోవాలన్నారు. అందులో తగిన నైపుణ్యత సాధిస్తే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. విద్యార్థులు ప్రతి విషయానికీ తల్లిదండ్రులపై ఆధారపడకుండా సొంతంగా ఎలా ఎదగాలో అలవర్చుకోవాలన్నారు. ఆత్మ విశ్వాసం, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జెమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌రెడ్డి, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీలలిత, బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రైతుల భూముల్లో..
అక్రమంగా మట్టి తవ్వకాలు

- రోడ్డు పనులకు అవసరమంటూ తవ్వకాలు
- ట్రాక్టర్ లోడు రూ.500కు అమ్ముకుంటున్న టీడీపీ నాయకులు
- పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితుల ఆవేదన





జేసీబీతో మట్టి తవ్వి ట్రాక్టర్లకు లోడు చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్లో) బాధిత ఎస్సీ రైతులు అప్పలరామన్న, ఉపేంద్ర

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. నరసన్నపేట మండలం బొడ్డవలసకు చెందిన ఎస్సీ రైతు కుటుంబాలు శ్రీరాంపురం వద్ద సాగు చేసి పంటలు పండించుకుంటున్న భూముల్లో మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి తహసీల్దార్ అనుమతి ఇచ్చారంటూ వందల కొద్దీ ట్రాక్టర్ల మట్టిని తవ్వేస్తున్నారు. పంట భూముల్లో మట్టిని తవ్వితే పంటలు ఎలా పండుతాయి.. తిండి గింజలు ఎక్కడి నుంచి వస్తాయి అంటూ ఎస్సీ రైతులు కూన అప్పలరామన్న, కూన రామారావు, కూన ఉపేంద్రలు వాపోతున్నారు. మండలంలోని రావులవలస పంచాయతీ శ్రీరాంపురం రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబర్ 25లో ఎల్‌పీ నంబరు 359లో తమకు మూడు ఎకరాల పొలం ఉందని, దీనిని 60 ఏళ్లుగా సాగు చేస్తున్నామని చెప్పారు. ఇప్పుడు దౌర్జన్యంగా తమ భూముల్లో మట్టిని తవ్వి పంటలు పండించుకోవడానికి వీలు లేకుండా చేస్తున్నారని వాపోయారు. న్యాయం కోసం పోలీసుస్టేషన్‌కు వెళ్లే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రావులవలస, గుండవల్లిపేటలకు చెందిన కొందరు ఎమ్మెల్యే పేరు చెప్పి మట్టి తవ్వకాలు చేస్తున్నారని తెలిపారు. అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపుతామని బెదిరిస్తున్నారని, కులం పేరుతో దూషించి దుర్భాషలాడుతున్నారని వాపోయారు. తహసీల్దార్ వద్దకు వెళ్లగా వెంటనే స్పందించి ఆర్ఐ, వీఆర్వోలను పంపారని, అయినా మట్టి తవ్వకాలు ఆపడం లేదని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ విషయమై కలెక్టర్, ఎస్పీలను ఆశ్రయిస్తామని తెలిపారు.

అనుమతి ఇవ్వలేదు..

రైతుల భూముల్లో మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదు. మాకు సమాచారం వచ్చిన వెంటనే ఆర్ఐ, వీఆర్వోలను పంపి మట్టి తవ్వకాలను ఆపించాం. మళ్లీ తవ్వుతున్నట్లు మాకు తెలియదు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, నరసన్నపేట తహసీల్దార్